

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. టీటీడీ బుధవారం ఉదయం ఆదాయ వివరాలను ప్రకటించింది. మంగళవారం 68,146 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం



● క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి దర్శనం చేసుకున్న టీటీడీ చైర్మన్

తిరుమల, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం నిరాడంబరంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఉదయం చైర్మన్ బీఆర్ నాయుడు, మరో 15 మంది సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేశారు. సంప్రదాయ వస్త్రధారణ, నుదుట నామంతో క్షేత్రం సంప్రదాయాన్ని పాటిస్తూ బీఆర్ నాయుడు తొలిగా పుష్కరిణి నీటి ప్రోక్షణ చేసుకుని వరాహస్వామిని దర్శించుకున్నారు. తర్వాత క్యూలైన్‌లో ఆలయంలోకి వెళ్లి ప్రమాణస్వీకారం చేశాక శ్రీవారిని దర్శించుకున్నారు. సాధారణంగా చైర్మన్ అంటే పుష్పగుచ్ఛాలు అందజేసి, పట్టువస్త్రాలతో సత్కరించే హడావుడి అధికంగా ఉంటుంది. ఈయన మాత్రం బొకే సంప్రదాయం వద్దని నిరాకరించడంతో ఆలయం ముందు ఎలాంటి హడావుడి కనిపించ లేదు. ఆలయం ముందూ ఎలాంటి ప్రసంగాలు చేయకుండా వెళ్లిపోయారు. ఇక సభ్యుల్లోనూ రాజకీయ నాయకులున్నా కార్యకర్తల హడావుడి కనిపించలేదు. తొలిరోజే సభ్యులు, టీటీడీలోని పలు విభాగాల అధికారులతో చైర్మన్ సమీక్షించారు. ఆయా విభాగాలు చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకునేందుకు సుదీర్ఘంగా సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై చర్చించడంతో పాటు గతంలో తలెత్తిన ఇబ్బందులు, విమర్శలపైనా మాట్లాడారు.

నేడు మరో ముగ్గురు

మిగిలిన సభ్యుల్లో ఫార్మా రంగానికి చెందిన సుచిత్ర ఎల్లా, స్థానిక బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, ముని కోటేశ్వరరావు గురువారం ప్రమాణం చేయనున్నారు. వీరితో పాటు కృష్ణమూర్తి వైద్యనాథన్ కూడా ప్రమాణం చేయాల్సి ఉన్నప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక, జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సదాశివరావు శుక్రవారం ప్రమాణం చేయనున్నారు.

ఇక కుప్పంలో
అభివృద్ధి పరుగులు

కడా ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదంతో నిధుల వరద

కుప్పం, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): కడా (కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ) ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం లభించింది. దీంతో ఇంతదాకా కాస్తంత నత్తనడకన నడిచిన కుప్పం నియోజకవర్గ అభివృద్ధి ఇకమీదట పరుగులు తీయనుంది. నిజానికి నాలుగు నెలల క్రితం టీడీపీ అధికారంలోకి వచ్చిన సుమారు నెలరోజులకే నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీతో పాటు కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలను కలుపుతూ కడా ఏర్పాటైంది. ఈ ఏడాది జులై 12న ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ కడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కడా ఏర్పాటుతో అంతకుముందున్న పీకేఎం ఉడా (పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) దానికదే రద్దు అయినట్లయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇతర అంశాలతోపాటు కడా ఏర్పాటుకు అధికారికంగా లాంఛనమైన ఆమోదముద్ర లభించింది. ఇప్పటికే కడా పరిధిలోని కుప్పం మున్సిపాలిటీతో పాటు మిగిలిన నాలుగు మండలాల సర్వతోముఖాభివృద్ధికి కడా పీడీ ఆధ్వర్యంలో, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పర్యవేక్షణలో, ముఖ్యమంత్రి సూచనలతో విజన్ డాక్యుమెంట్ తయారు చేశారు. ప్రభుత్వంలోని మొత్తం 18 విభాగాలను ఇందులో భాగస్వాములను చేశారు. అమరావతి నుంచి ఆయా విభాగాలలో నిపుణులైన మేధావులు వచ్చి విజన్ డాక్యుమెంట్ తయారీలో పాలు పంచుకున్నారు. అవసరమైన నివేదికలు అందించారు. వీటన్నిటి సమగ్ర రూపంగా విజన్ డాక్యుమెంట్ తయారీ జరిగింది. ప్రధానంగా పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పన కేంద్రంగా ఈ డాక్యుమెంట్‌ను రూపొందించారు. కడా పీడీ ఇటీవల అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ డాక్యుమెంట్‌ను సమర్పించి వచ్చారు. విజన్ డాక్యుమెంట్‌లోని ప్రతిపాదనల ప్రకారంగా కొన్ని అభివృద్ధి పనులకు రూ.కోట్లలో నిధుల కేటాయింపు కూడా జరిగింది. అయితే విడుదల ఇంకా కాలేదు. ఇప్పుడు కడా ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం లభించడమనే లాంఛనం కూడా పూర్తి అయింది కాబట్టి, ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. దీంతో ఇక కడా పరిధిలో అభివృద్ధి వేగవంతం అయ్యే అవకాశం ఏర్పడింది.

నాడు శ్రీగంధం కేసులో సస్పెన్షన్

నేడు ఎర్రచందనం కేసులో అరెస్టు ● ఎర్రావారిపాళెంలో ఓ కానిస్టేబుల్ తీరిది



గుర్రప్ప

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల కిందట శ్రీగంధం కేసులో సస్పెండైన కానిస్టేబుల్ గుర్రప్ప.. బుధవారం ఎర్రచందనం కేసులో అరెస్టయ్యారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇతడిపై అనేక ఆరోపణలున్నాయి. గతంలో శ్రీగంధం అక్రమ రవాణా కేసులో కొంతమంది నిందితులను, ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం రెడ్డిని బెదిరించి మామూళ్లు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఘటనలో రెండు నెలల కిందట కానిస్టేబుల్ గుర్రప్పను సస్పెండు చేశారు. దీనిపై లోతైన దర్యాప్తు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఈ క్రమంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సమగ్ర విచారణ చేపట్టగా.. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులోనూ గుర్రప్పకు ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఏ4 ముద్దాయితో నేరుగా సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రిమాండుకు తరలించారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

టీటీడీ సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం టీటీడీ చైర్మన్‌తో పాటు మరో 15 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం చేసిన సభ్యులు..


బి.మహేంద్రరెడ్డి


అనుగోలు రంగశ్రీ


తమ్మిశెట్టి జానకీదేవి


వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


అదిత్ దేశాయ్


బి.ఆనంద్‌సాయి


జంగా కృష్ణమూర్తి


జాస్తి పూర్ణసాంబశివరావు


ఎం.శాంతారాం


మల్లెల రాజశేఖర్‌గౌడ్


ఎంఎస్ రాజు


నన్నూరి నర్సిరెడ్డి


ఆర్‌ఎన్ దర్శన్


నరేష్‌కుమార్


పి.రామమూర్తి

● పద్మావతి, ఎస్వీయూల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పీజీ విద్యార్థులు

విద్యార్థుల సేద్యం


ఎస్వీయూ గ్రీన్‌టీం




పద్మావతి వర్సిటీ గ్రీన్‌టీం

పుస్తకం పట్టిన చేతులే పారా పలుగూ అందుకుంటున్నాయి. ల్యాబరేటరీల్లో పరిశోధనలు చేసే విద్యార్థులు, మట్టిలో విత్తనాలు నాటి, కలుపు తీసి, కూరగాయలు పండించి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీ, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. యూనివర్శిటీల ప్రాంగణంలోనే పాలేకర్ స్ఫూర్తిగా కూరగాయలు సాగు చేస్తున్నారు. వర్డ్ సంస్థ వ్యవస్థాపకుడు గంగాధరం నేతృత్వంలో విద్యార్థులు గ్రీన్‌టీం లుగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పనుల్లో సందడి చేస్తున్నారు.

ప్రత్యేక కథనం - తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

20 అడుగుల నేల వారి ప్రయోగ క్షేత్రం

ప్రకృతి వ్యవసాయ ప్రయోగశాలకు ఈ రెండు యూనివర్శిటీల విద్యార్థులు కేటాయించుకున్న నేల.. కేవలం 20 చదరపు అడుగులు మాత్రమే. ఒక కుటుంబం ఏడాది పొడవునా ఆరోగ్యకరమైన కూరగాయలు పండించుకోవడానికి ఈ తావు చాలు అంటారు గంగాధరం. పద్మావతిలో 20 మంది విద్యార్థినులు, ఎస్వీయూలో 20 మంది రెండు గ్రీన్ టీంలుగా ఏర్పడ్డారు. తమ ప్రాంగణాల్లో ప్రయోగ క్షేత్రాన్ని సిద్ధం చేసుకున్నారు. మడులుగా మలచుకుని విత్తనాలు నాటారు. ఇప్పుడవి కాపుకొచ్చాయి. తమ చేతులతో నాటి నీళ్ల పోసి పెంచిన మొక్కలు కాసిన నవనవలాడే కూరగాయలను చూసి వారు మురిసిపోతున్నారు.

సొంతంగా ఎరువులు


విద్యార్థులకు మొక్కల పోషణ గురించి వివరిస్తున్న గంగాధరం

పూర్తిగా సేంద్రియ పద్ధతిలో చేస్తున్న సేద్యం ఇది. దేశీయ విత్తనాలే నాటుతున్నారు. వంగ, బెండ, సొర, బీర, మిరప, టమోటా,మొక్క జొన్న, బీన్స్ వంటి కాయగూరలు ఈ క్షేత్రాల్లో ఉన్నాయి. తోటకూర, సిరికూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి ఆకుకూరలున్నాయి. సస్యరక్షణలో భాగంగా బంతి పూల మొక్కలు నాటారు.అంతర పంటగా మొక్కజొన్న నాటారు. చిక్కుడు, సొర, బీర వంటి తీగజాతి మొక్కలు ఒక పక్కగా నాటారు. రసాయన ఎరువులు వాడడం లేదు. జీవామృతం, వేప కషాయం, ఆవు పేడ, మూత్రం, శనగ పిండి, పుట్టమట్టితో తామే ఎరువులు తయారు చేసుకుని ఈ పంటలకు అందిస్తున్నారు.

ఈ అనుభూతి అద్భుతం

రసాయనాల అవశేషాలు లేని ఆహారం తింటే ఆరోగ్యంగా ఉంటాం. సేంద్రియ పద్ధతిలో మేం పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యకరమైనవి. సహజ ఎరువులే వాడుతున్నాం. మా యూనివర్శిటీలో మా చేతులతో కూరగాయలు పండిస్తున్న అనుభూతి అద్భుతంగా ఉంది.

- డి. ప్రియాంక,
ఎమ్మెస్సీ జువాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

ప్రకృతి సేద్యంపై పరిశోధన

పీజీ తర్వాత సహజ సిద్ధంగా లభించే ఆహార పదార్థాల్లోని పోషక విలువలపై పరిశోధన చేయాలనే ఆలోచనతో ఉన్నా. మా యూనివర్శిటీలోని ఈ ప్రయోగ క్షేత్రంలో పనిచేయడం ప్రాథమిక పరిశోధనలా ఉంది. చాలా సంతోషంగా ఉంది.

-ఎం. పల్లవి, ఎమ్మెస్సీ హోం సైన్స్ ఫుడ్ టెక్నాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

చీడపీడలపై యుద్ధం

వ్యవసాయంలో చీడపీడలను ఎదుర్కొవడం పెద్ద సవాలు. రసాయన మందులు చల్లి సులువుగా వీటిని నివారిస్తున్నారు. అయితే వీటి అవశేషాలు మిగిలిపోయి మనం ఆహారంగా తీసుకున్నప్పుడు అనేక రోగాలకు కారణంగా మారుతున్నాయి. ఇందుకు విరుగుడుగా ఈ రెండు యూనివర్శిటీల్లో సేంద్రియ పద్ధతిలోనే చీడపీడలపై యుద్ధం చేస్తున్నారు. ముందుగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుని నేలలో నాటుతారు. ప్రతి 15 రోజులకోసారి జీవామృతం నీటిలో కలిపి మొక్కలకు పారిస్తారు. ఇది మంచి పోషకాలను ఇస్తుంది. మట్టిలో ఘనజీవామృతం చల్లడం ద్వారా వానపాములు, జీవరాశులు వ్యాప్తి చెంది పంట భూమి సారవంతమవుతుంది. చీడపీడలు ఆశించకుండా వేపాకు, గోమూత్రం, ఆవుపేడతో చేసిన నీమాస్త్రం పిచికారీ చేస్తున్నారు. పురుగు ఆశిస్తే.. వేప, ఉమ్మెత్త, సీతాఫలం, పల్లేరు ఆకుల జిగురును ఆవు మూత్రంలో ఉడికించి తయారుచేసుకున్న బ్రహ్మాస్త్రం పిచికారీ చేస్తారు. ఎంతకీ లొంగని చీడను అగ్నాస్త్రంతో ఎదుర్కొంటున్నారు. మిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు, ఆవుమూత్రంతో దీనిని తయారు చేసుకుంటున్నారు. ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు, కాయ తొలుచు పురుగు, వేరు పురుగు నివారణకు దీనిని వాడుతున్నారు.

ఒత్తిళ్లన్నీ మరచిపోతున్నాం

మేం చదువుకునే చోటే ఆకుకూరలు, కూరగాయలు, పూలు పండిస్తున్నాం. చదువుకుంటూనే, స్నేహితులతో కలిసి యూనివర్సిటీలోనే వ్యవసాయ పనులు చేస్తూ ఉండటం చెప్పలేని ఆనందాన్ని ఇస్తూ ఉంది. చదువుల్లో ఉన్న ఒత్తిడినంతా పచ్చని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని చూసిన వెంటనే మాయమై పోతూ ఉంది.

- ఖలీద్,
ఎమ్మెల్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ

మా పల్లె రైతులనూ మారుస్తా

క్లాసుల్లేని సమయంలో ఇలా సేద్యం పనులు చేయడం చాలా బావుంది. ప్రతి శుక్ర, శని వారాల్లో గ్రీన్ టీం ఆధ్వర్యంలో కలుపు తీయడం, నీళ్ళు కట్టడం చేస్తున్నాం. ఈ అనుభవంతో మా ఊరిలోనూ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించాలని అనిపిస్తుంది.

- రూపేష్ కుమార్,
ఎమ్మెస్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ







అఖిలాండం వద్ద కర్పూరం వెలిగిస్తున్న సాయిధరమ్ తేజ్ - క్యూలో సప్తగిరి - ఆలయం ముందు స్నేహారెడ్డి

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రభాతసేవలో హీరో సాయిధరమ్ తేజ్, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి పాల్గొన్నారు. సుప్రభాత పఠనం అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో నటులు సప్తగిరి, రఘు, దగ్గుబాటి అభిరామ్, దర్శకుడు అట్లూరి వెంకటేశ్వరరావు, నిర్మాత సంతోష్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై హత్యాయత్నం

● ఒకరి పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డు సమీపంలో ఉన్న ఈదులగుంట వద్ద కలకలం రేపింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, శ్రీకాళహస్తి పట్టణం తెట్టు ప్రాంతానికి చెందిన వాసు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ సాయంత్రం చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి కత్తితో వారిపై విరుచుకుపడ్డాడు. దీంతో విష్ణువర్ధన్ తీవ్రంగా, వాసు స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న కొందరు గమనించి యువకులను ఆటోలో శ్రీకాళహసి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ విష్ణువర్ధన్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ వాసు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. కాగా సాయిబాబా ఆలయం వద్ద కత్తితో దాడికి పాల్పడిన సమయంలో స్థానికులు హడలిపోయారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగం వద్ద రక్తపు మరకలను చూసి రోగులు, వారి బంధువులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనపై టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా... తాము ఆస్పత్రికి చేరుకునేలోగా క్షతగాత్రులు చికిత్స నిమిత్తం వెళ్లిపోయారన్నారు. విచారణ చేస్తున్నామని తెలిపారు.



ఈ స్థలంలోకి ప్రవేశిస్తే..!

● శిక్షార్హులంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు

రేణిగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఈ స్థలం కోర్టులో ఉన్నది. ఇందులో ప్రవేశించే వారు శిక్షకు అర్హులు' అంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు వెలిసింది. ఇది లబ్ధిదారులను ఆందోళనకు గురి చేస్తోంది. రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ కుర్రకాలువ సమీపంలోని పద్మానగర్‌లో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి పలువురికి ఇంటి స్థలాలను కేటాయించారు. ఇళ్ల స్థలాలకు పోను ఉద్యానవనం కోసం ఎకరా వదిలిపెట్టారు. ప్రస్తుతం పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు వివాదమంటూ బుధవారం హెచ్చరిక బోర్డు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ బోర్డులో ఉన్న నెంబరుకు ఫోను చేయగా కొత్తపాళేనికి చెందిన సుబ్రమణ్యంగా తెలిసింది. 'నలభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హయాంలో రైతులకు వ్యవసాయ భూములను పంపిణీ చేసి పట్టాలిచ్చారు. ఇందులో మా తల్లి నాగభూషణం పేరిట భూమి ఉంది. ఇక్కడ వైసీపీ ప్రభుత్వం జగనన్న లే అవుట్ ఏర్పాటుకు భూసేకరణ చేసి ఎకరాకు రూ.32లక్షల పరిహారం ఇచ్చింది. మా భూమికి ఎటువంటి పరిహారం ఇవ్వకుండా రెండేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. దీంతో కోర్టును ఆశ్రయించాను' అని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. హెచ్చరిక బోర్డు విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వీఆర్వోతో విచారణ జరిపించినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులుంటే తమకు చూపించాలని లేనిపక్షంలో ఆ బోర్డును తొలగిస్తామని స్పష్టం చేశారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పక్కాగా నిర్వహించండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6: ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10వ తేది ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను 'జ్ఞానభూమి' పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరు 70130 08498ను సంప్రదించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించాలని ఆదేశించారు. ఉచిత శిక్షణ కోసం జిల్లా నుంచి 539 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు చెన్నయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం డీవీఎంగా శ్రీనివాసరావు


నూతన డీవీఎంను పరిచయం చేసుకుంటున్న టూరిజం ఉద్యోగులు

తిరుపతి అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ జిల్లా డివిజనల్ మేనేజర్‌గా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఉన్న గిరిధర్‌రెడ్డిని మాతృసంస్థ(ఆర్టీసీ)కు బదిలీ చేశారు. నెల్లూరు డీవీఎంగా ఉన్న శ్రీనివాసరావును తిరుపతికి బదిలీ చేశారు. బుధవారం ఉదయం జూపార్కు రోడ్డులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి సంస్థ ఆదాయానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇద్దామని కోరారు.

సదరన్ డిస్కం బోర్డు లీగల్ కౌన్సిల్‌గా మధుసూదన రెడ్డి



తిరుపతి(ఆటోనగర్)నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ తిరుపతి బోర్డు లీగల్ కౌన్సిల్‌గా ఎన్.మధుసూదన రెడ్డిని నియమిస్తూ బుధవారం డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్ రెడ్డి తిరుపతి ఆపరేషన్ టౌన్ డివిజన్‌లో బోర్డు లీగల్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తారు. 2027 అక్టోబరు 31 వరకు ఆయన మూడేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు.


దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

● 40 రోజుల్లో రూ.1.94 కోట్ల ఆదాయం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. రూ. 1,94,41,581 నగదు హుండీ ద్వారా వచ్చింది. ఇక బంగారం 85.100 గ్రాములు, వెండి 607.10 కిలోలు, ఇతర దేశాలకు చెందిన 145 నోట్లు విదేశీ నగదు వచ్చింది. సెప్టెంబరు 25వ తేదీన చివరిగా హుండీ లెక్కింపు జరిగింది. 40 రోజుల తర్వాత బుధవారం జరిగిన లెక్కింపులో వచ్చిన ఆదాయం 1.94 కోట్లుగా అధికారులు ప్రకటించారు.

నేడు రెండు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

● వర్చువల్‌గా భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు

తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వర్చువల్‌గా భూమిపూజ నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సబ్ స్టేషన్ల నిర్మాణ శంకుస్థాపనలో భాగంగా తడ మండలం మాంబట్టు, రేణిగుంట మండలం తూకివాకంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమిపూజ జరగనుంది. ఇందులో మాంబట్టు సబ్ స్టేషన్‌కు రూ.43.50 కోట్లు, తూకివాకం సబ్‌స్టేషన్‌కు రూ.76.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు గురువారం సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మంగళగిరిలో శంకుస్థాపన చేసిన అనంతరం ఇక్కడ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సాల్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా భూమిపూజకు ఏర్పాట్లు చేశామని ట్రాన్స్‌కో డీఈ బలరామమూర్తి తెలిపారు.

ట్రంప్ ఎన్నికపై సంబరాలు



అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండవ సారి ఎన్నికైన సందర్భంగా చిత్తూరు కుర్రాడు యూట్యూబర్ తేజ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్ వద్ద టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ ట్రంప్ యాసలో మాట్లాడినట్లు డబ్బింగ్ వీడియోస్ తీయడం తాను అదృష్టంగా భావిస్తున్నానన్నారు.రాజేష్, నవాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి



టెర్రకోట కళారూపాలను తిలకిస్తున్న జేసీ విద్యాధరి

టెర్రకోట కళారూపాలకు జీఐ ట్యాగ్

టెర్రకోట కళారూపాలకు త్వరలోనే జీఐ ట్యాగింగ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. బుధవారం ఆమె పలమనేరులోని టెర్రకోట కళాకేంద్రాన్ని సందర్శించారు. కళాకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మార్కెటింగ్ సమస్యతో పాటు మట్టి కలిపేందుకు కావలసిన రోలర్స్ మిషన్ అవసరముందని కళాకారుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ విన్నవించారు. దీనిపై స్పందించిన జేసీ జీఐ ట్యాగింగ్‌కోసం ప్రయత్నిస్తామని, అది వస్తే అందరికీ ఈ కళారూపాల గురించి తెలుస్తుందని, అప్పుడు మార్కెటింగ్‌కు అనుకూలంగా వుంటుందన్నారు. ఆర్డీవో భవాని, తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

- పలమనేరు, ఆంధ్రజ్యోతి

జనారణ్యంలోకి కొండ చిలువ



గుడిపాల మండలం పాపసముద్రం పంచాయతీలోని దిగువ పిళ్లారి కుప్పం వద్ద ఓ కొండ చిలువ ప్రజలను భయాందోళనకు గురిచేసింది. బుధవారం దిగువపిళ్లారికుప్పం సమీపంలో కూలీలు ఉపాధి పనులు చేస్తుండగా పది అడుగుల కొండ చిలువ కనపడటంతో భయపడి పరుగులు తీశారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు చెప్పగా వారు అక్కడకు చేరుకున్నారు. కొండ చిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

- గుడిపాల, ఆంధ్రజ్యోతి

విలీన దశలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు



చిత్తూరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల్లో వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తూ దేశంలోనే ఉన్నత శిఖరాల్లో నిలిచిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు విలీన దశలో ఉంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ఖర్చుల నియంత్రణ కోసం సప్తగిరి గ్రామీణ బ్యాంకును కేంద్రం విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రక్రియను 2025 మార్చి 31వ తేదిలోగా పూర్తి చేసే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ రోడ్డు మ్యాపును సిద్ధం చేసింది. ఒకే రాష్ట్రం.. ఒకే ఆర్‌ఆర్‌బీతో బ్యాంకుల పనితీరు మెరుగవుతుందని కేంద్రం, నాబార్డు నిర్ణయించాయి. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు రుణాలివ్వడానికి ఆర్‌ఆర్‌బీ చట్టం-1976 కింద సప్తగిరి బ్యాంకు ఏర్పడింది. ఈబ్యాంకులో కేంద్రం వాటా 50 శాతం, స్పాన్సర్డ్ బ్యాంకు అయిన ఇండియన్ బ్యాంకు వాటా 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 15 శాతం ఉంది. సప్తగిరి గ్రామీణ బ్యాంకు 2023-24 బ్యాలెన్స్ షీట్‌ను పరిశీలిస్తే బ్యాంకులో రూ.13146.02 కోట్ల డిపాజిట్లు ఉండగా, అడ్వాన్సులుగా రూ.12816.57 కోట్లు చెల్లించింది. మొత్తం వ్యాపారం గత ఏడాది కాలంలో రూ.25962.59 కోట్లు నిర్వహించి గణనీయ స్థితిలో ఉంది. రూ.1775.34 కోట్లు సొంత నిధులు కలిగి, నెట్ ప్రాఫిట్ రూ.350.30 కోట్లు ఉంది.

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ రాజీనామాకు ఆమోదం



తన రాజీనామా పత్రంపై సంతకం చేస్తున్న డాక్టర్ సుధీర్

కుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ ఛైర్మన్ పదవితోపాటు 16వ వార్డునుంచి ఎన్నికైన కౌన్సిలర్ పదవికి కూడా ఆయన చేసిన రాజీనామాను మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరడానికి కొద్ది నిమిషాల ముందు డాక్టర్ సుధీర్ మున్సిపల్ ఛైర్మన్ పదవితో పాటు, కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఆ లేఖను ముఖ్యమంత్రికి సమర్పించారు. అనంతరమే టీడీపీలో ఆయన చేరిక జరిగింది. రాత్రికిరాత్రే కుప్పం చేరుకున్న సుధీర్, బుధవారం అత్యవసరంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్మన్‌గా ఆయన అధ్యక్షతనే చిట్టచివరి సమావేశం జరిగింది. ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేస్తున్నానని, ఆమోదించాలని టేబుల్ అజెండాగా సుధీర్ రాసిన రాజీనామా లేఖను పెట్టారు. ఈ రాజీనామాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. టీడీపీలో చేరి తిరిగి వైసీపీలోకి వెళ్లిపోయిన కౌన్సిలర్ సయ్యద్ అలీతో పాటు ఇద్దరు వైస్ ఛైర్మన్లతో సహా 12 మంది వైసీపీ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. టీడీపీనుంచి ఎన్నికైన ఆరుగురు కౌన్సిలర్లతోపాటు మధ్యలో ఆ పార్టీలో చేరిన 4 కౌన్సిలర్లు హాజరయ్యారు. ఛైర్మన్‌తో సహా టీడీపీ కౌన్సిలర్లు 11 మంది హాజరు కావడంతో ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు డాక్టర్ సుధీర్ చేసిన రాజీనామాలు ఆమోదం పొందాయి. దీనితోపాటు రూ.7.70 లక్షలకు ప్రతిపాదించిన అభివృద్ధి పనులను కూడా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. సమావేశంలో డాక్టర్ సుధీర్‌ను వీడ్కోలు పలుకుతూ ఆయనను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు.

నా భర్త కనిపించడం లేదు

అత్తింటివారిపై భార్య ఫిర్యాదు



అమృత, మంజునాథరెడ్డి

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తన భర్త కనిపించడం లేదంటూ రామకుప్పం మండలం పెద్దగానూరుకు చెందిన అమృత బుధవారం పోలీసులకు పిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గోవిందపల్లెలోని అమృత మామ మురుగేష్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన తన భర్త మంజునాథరెడ్డి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్టోబరు 16న తాము కులాంతర వివాహం చేసుకున్నామని, మంజునాథరెడ్డి కుటుంబీకులు దీనిని అంగీకరించలేదని అన్నారు. అప్పటి నుంచి తరచూ ఫోన్ చేసి దుర్భాషలాడుతూ, మానసిక వేధింపులకు పాల్పడేవారని వివరించారు. తన అత్తగారింటి వారిపై తనకు అనుమానాలున్నట్లు ఆమె పిర్యాదులో పేర్కొన్నారు. రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.38 కోట్లతో వి.కోటలో సబ్‌స్టేషన్

నేడు సీఎంచే వర్చువల్‌గా ప్రారంభం



వి.కోటలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన సబ్‌స్టేషన్

పలమనేరు / వి.కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం తోటకనుమ పంచాయతీ కస్తూరినగర్ వద్ద 38 కోట్ల రూపాయలతో నిర్మించిన 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వి.కోటలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించనున్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో వి.కోట మండలంలో పూర్తిగా లోఓల్టేజి సమస్య తీరనుంది. ఇప్పటి వరకు వి.కోట మండలంలోని వి.కోట, పాముగానిపల్లి, కస్తూరినగరం, దొమ్మరమిట్ట, యాలకల్లు తదితర సబ్‌స్టేషన్లకు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఇకపై వి.కోట నుంచే విద్యుత్ సరఫరా అవుతుంది. అంతేకాక వి.కోటలో నూతనంగా ప్రారంభించనున్న 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి బైరెడ్డిపల్లి మండలంలోని బైరెడ్డిపల్లి, కడపనత్తం, తీర్థం సబ్‌స్టేషన్లకు కూడా విద్యుత్ సరఫరా అవుతుంది. ఇప్పటివరకు పైమూడు సబ్‌స్టేషన్లకు పలమనేరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. భవిష్యత్తులో వి.కోటలో సాంకేతిక లోపం ఏర్పడితే బైరెడ్డిపల్లికి ప్రత్యామ్నాయంగా పలమనేరు నుంచి, వికోటకు శాంతిపురం సబ్‌స్టేషన్ నుంచి నిరంతర సరఫరా చేసే అవకాశం వుంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఇటీవల విద్యుత్ ఉన్నతాధికారుల సమక్షంలో టెక్నికల్ ఛార్జింగ్ కూడ చేసి అధికారులు ఈ సబ్‌స్టేషన్ పనితీరును సమీక్షించారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పరీక్షించండి

● కలెక్టర్ ఆదేశం



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం కింద ప్రస్తుత ఏడాది మంజూరైన అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత పరీక్షించాలని, ఆ తరువాతే సంబంధిత పనులకు చెందిన బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో పంచాయతీరాజ్ డీఈ, ఏఈలతో ఇంజనీరింగ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది 1503 సిమెంట్ కాంక్రీట్ పనులు మంజూరు కాగా, రూ.13కోట్ల విలువ కల్గిన 248 పనులు పూర్తయ్యాయని చెప్పారు. రూ.8 కోట్లకు సంబంధించి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా, రూ.2.50 కోట్లు చెల్లింపులు జరిగినట్లు వివరించారు. ఐసీడీఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ భవననిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఐదేళ్లు నిద్రపోయి ఇప్పుడే లేచారా?

● రోజాపై టీడీపీ అధికారప్రతినిధి మీరా ఫైర్



మాట్లాడుతున్న మీరా

నగరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మాజీ మంత్రి రోజాకు ఐదేళ్ల తర్వాత మహిళలపై ప్రేమ పుట్టుకొచ్చిందంటూ టీడీపీ అధికార ప్రతినిధి మీరా ఎద్దేవా చేశారు. ఆడపిల్లలను రక్షించాలన్న ఉద్దేశముంటే గత ఐదేళ్లలో ఎన్ని అరాచకాలు జరిగాయి.. ఆనాడు మీరెక్కడ ఉన్నారంటూ నిలదీశారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏకంగా పులివెందులలో అత్యాచారం జరిగితే నేటికీ ముద్దాయిని పట్టుకోలేదని గుర్తుచేశారు. రైల్వేస్టేషన్‌లో గర్భిణిపై అత్యాచారం జరిగితే దిక్కు లేకుండా పోయిందని, ట్రాక్టర్లతో మహిళను తొక్కించి చంపినప్పుడు పట్టించుకోలేదని అన్నారు. ఓ మహిళగా ఆనాడు స్పందించకుండా ఇప్పుడు పరుగులు తీసి ప్రెస్‌మీట్‌లు పెడతావా .... ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.జగన్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో సీఎం ఇంటి ముందు వెళుతున్న మహిళపై అత్యాచారం జరిగితేనే దిక్కులేదని, నగరి నియోజకవర్గంలో రోజా మంత్రిగా వున్నపుడు ఓ ఉద్యోగినిపై సాటి ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడితే ఏమి చేశావని ప్రశ్నించారు.ఎన్నికల్లో ఓడిపోవడంతో పిచ్చిపట్టి నోటికి ఏమివస్తే అది మాట్లాడటం సిగ్గుచేటన్నారు.హోం మంత్రి అనిత గురించి మాట్లాడే అర్హత రోజాకు సిగ్గూ ఎగ్గూలేదంటూ విమర్శించారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వివిధ విభాగాల ద్వారా సేవల కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని, సంబంధిత అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్, అపోలో యాజమాన్య ప్రతినిధులతో సమీక్షించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా విస్తృతంగా సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో అవసరమైన పరీక్షల నిర్వహణకు సామర్థ్యాన్ని పెంచాలని, తద్వారా పేదప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణలో మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో యూనిట్ ఇన్‌చార్జి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌డే



అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డేకు 5 ఫిర్యాదులు వచ్చినట్లు ఆశాఖ ఆపరేషన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం ప్రత్యేకంగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 5 అర్జీలు వస్తే అప్పటికప్పుడే 2 అర్జీలు పరిష్కారమైనట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేపై ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్తు శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

డీఎస్సీ శిక్షణ పొందే అభ్యర్థులకు 10న స్క్రీనింగ్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత మెగా డీఎస్సీ శిక్షణను పొందేందుకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈనెల 10వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెగా డీఎస్సీ ద్వారా ఎస్జీటీ, ఎస్‌ఏ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, భోజన, వసతి సౌకర్యాలతో మూడునెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ మురకంబట్టు వద్ద గల సీటమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల, పూతలపట్టు మండలం పి.కొత్తకోట వద్ద వున్న వేము ఇంజినీరింగ్ కళాశాల, గంగవరం మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు https:// jananabhumi.ap.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు పొందాలన్నారు. అభ్యర్థులు ఏదైనా గుర్తింపు కార్డును తీసుకునిరావాలని కలెక్టర్ తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ సభ్యత్వంతో బీమా సౌకర్యం



వడ్డిపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న నాయకులు

కల్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో రూ.5 లక్షలు ప్రమాద బీమాతో పాటు పలు రాయితీలు లభిస్తాయని సీనియర్ టీడీపీ నాయకులు కుమార్ రెడ్డి, ధనంజయనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలంలోని 25 పంచాయతీల్లో కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నాయకులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.ఐదు లక్షలు బీమా, అంత్యక్రియలు కోసం రూ. పదివేలు అందిస్తారన్నారు. గాయపడిన వ్యక్తులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స సదుపాయం ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు చెంగ్రాయనాయుడు, రమేష్, అన్నాస్వామి నాయుడు, సుబ్బరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను లాక్కొని వీఆర్ఏ బెదిరిస్తున్నాడు

తహసీల్దార్ కార్యాలయం ముందు నక్కబండ కాలనీవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న నక్కబండ కాలనీ వాసులు

పుంగనూరు, నవంబరు6(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను ఓ వీఆర్ఏ లాక్కొని బెదిరిస్తున్నాడని మహిళలు ఆరోపించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు వారు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాలను కేటాయించిందన్నారు. వీఆర్ఏ వెంకటముని, అతడి కుటుంబ సభ్యులు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు తమకే వస్తాయని, దౌర్జన్యాలు చేసి ఆక్రమించుకుంటున్నట్లు వాపోయారు. అనంతరం ఏఆర్ఏపై తహసీల్దార్ రాముకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో చంద్రప్ప, మహిళలు మంజులమ్మ, కవిత, రామక్క, సీతమ్మ, పార్వతమ్మ, రెడ్డెమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



రామకుప్పం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రామకుప్పం పోలీస్‌స్టేషనుకు ఎస్ఐ వచ్చారు. నాలుగున్నర నెలలుగా ఇక్కడ ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న శివకుమార్ ఎన్నికలకు ముందు వైసీపీకి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలొచ్చాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన పదిరోజులకు ఆయన వీఆర్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి పోలీసు ఉన్నతాధికారులు పలువురిని రామకుప్పం ఎస్ఐగా నియమించినా వారెవరూ రావడానికి సముఖత వ్యక్తం చేయలేదు. తిరుపతి జిల్లాలో ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటమోహన్‌ను రామకుప్పం ఎస్ఐగా నియమిస్తూ ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయపక్షాలు, ప్రజలు సహకరించాలని కోరారు. టీడీపీ నాయకులు మునస్వామి, పత్ర నారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతిలతో కలిసి టీడీపీ నేతలు ఎస్ఐను కలిసి సత్కరించారు.

ముందువెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న కంటైనర్

క్యాబిన్‌లో చిక్కుకుపోయిన డ్రైవర్ ● అరగంట పాటు పోలీసులు శ్రమించి వెలికితీత



నుజ్జునుజ్జైన కంటైనర్ ముందుభాగం

గంగవరం, నవంబరు 6 : బెంగళూరు-చెన్నై రహదారిలో గంగవరం మండల పరిధిలోని దండపల్లె క్రాస్ జంక్షన్‌లో ముందువెళ్తున్న వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోవడంతో అర్ధగంట పాటు పోలీసులు శ్రమించి అతికష్టంపై డ్రైవర్‌ను రక్షించారు. గంగవరం సీఐ కథనం మేరకు... బెంగళూరు-చెన్నై హైవేలో అతి వేగంగా వెళ్తున్న కంటైనర్ లారీ, గంగవరం మండలం దండపల్లె జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో కంటైనర్ లారీ ముందుభాగం నుజ్జునుజ్జైంది. ఉత్తరాఖండ్‌కు చెందిన డ్రైవర్ రమేష్ బండారి కంటైనర్ ముందుభాగంలో చిక్కుకుపోయాడు. ప్రమాదానికి గురైన వాహనం రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో అర్ధగంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఘటన తెలిసిన వెంటనే డీఎస్పీ ప్రభాకర్, సీఐలు ప్రసాద్, నరసింహరాజుతోపాటు పలువురు ఎస్ఐలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్‌ను కాపాడడానికి ఎంత ప్రయత్నించినా వీలుకాకపోవడంతో క్రేన్‌లు, ఎక్స్‌కవేటర్‌లను తెప్పించి అర్ధగంటపాటు శ్రమించి బయటకు తీయగలిగారు. అప్పటికే డ్రైవర్ రమేష్‌బండారి కాళ్లు నుజ్జునుజ్జై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పోలీసులు హుటాహుటిన డ్రైవర్‌ను పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం సీఐ ప్రసాద్ తెలిపారు.

బైరెడ్డిపల్లెలో బైపాస్ రోడ్డు ఏర్పాటుపై ఆర్డీవో పరిశీలన



బైరెడ్డిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో బైపాస్‌రోడ్డు ఏర్పాటుకు సంబంధించి నిర్దేశించిన అలైన్‌మెంట్‌ను బుధవారం పలమనేరు ఆర్డీవో భవాని పరిశీలించారు. ఈ సందర్భంగా బైపాస్‌రోడ్డు వెళ్లే ప్రాంతాన్ని పరిశీలించి తహసీల్దార్ మాధవరాజుకు తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈఈ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ లోకనాథం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొండామారిలో వైద్య శిబిరం

చౌడేపల్లె : పెద్దకొండామారిలో బుధవారం సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముంతాజ్ అలీ జన్మదినం సందర్భంగా ఉచిత ఆయుర్వేద చికిత్స శిబిరం నిర్వహించారు. 300 మంది రోగులకు చికిత్సలు కల్పించి మందులు పంపిణీ చేశారు.

యాప్‌లో డ్వాక్రా సంఘాల సమాచారం



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

పలమనేరు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ పేర్కొన్నారు. బుధవారం పలమనేరు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సిబ్బందికి, రిసోర్స్ పర్సన్స్‌కు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ మహిళా సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేనందున మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో వాస్తవిక సమాచారాన్ని పొందుపర్చేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ జీవనోపాధులు మెరుగుపరచుకోవాలన్నారు. మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని, అందుకు మార్కెటింగ్ వసతి కల్పిస్తామన్నారు. టీఈలు కృష్ణవేణి, ప్రమీల, బాబా, సీఎంఎం, సీఓలు, డీవోలు, డీఆర్‌పీ, టీఎల్ఎఫ్, ఆర్పీఎఫ్, ఎస్ఎల్ఎఫ్, ఆర్పీలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేయండి : జడ్పీ చైర్మన్



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కోసం అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో సమష్టిగా పనిచేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎంపీపీ యువరాజ్ నేతృత్వంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. తాగునీటి సమస్యపై సత్వరం స్పందించాలన్నారు. ఉపాధి పనులు పూర్తయినా బిల్లులు అందలేదని సభ్యులు ఏపీఎంను ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపుపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కీలపల్లె సప్లై ఛానల్, గంగమ్మ ఏరు ఆధునీకరించేందుకు, కాల్వలను శుభ్రం చేసేందుకు రూ. 40 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపామన్నారు. మండలాన్ని కరువు మండలంగా గుర్తించారన్నారు. ఉపాధి పనులకు సంబంధించి గ్రామ సభల ద్వారా గుర్తించిన వాటికి ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చినా, కొంతమందికి స్థలాలు చూపలేదని పలువురు సభ్యులు రెవెన్యూ వారిని ప్రశ్నించగా, సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పార్వతి బదులిచ్చారు. వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీంఖాన్, జిల్లా పరిషత్ సలహా సభ్యులు ఎస్.ఏ.గౌస్, ఎంపీడీవో ఈశ్వరన్, ఏపీవో అశోక్‌రెడ్డి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధికేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



పలమనేరులో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు స్థల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

పలమనేరు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధికేంద్రం ఏర్పాటుకు బుధవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. పలమనేరులోని డ్రైనేజి నీరు పలమనేరుకు ఆనుకొని ఉన్న పెద్దచెరువులో కలిసి భూగర్భజలాలు కలుషితమయ్యాయి. దీంతో మూడు దశాబ్దాలుగా డ్రైనేజి నీటిని శుద్ధిచేసే కేంద్రం ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు కోరడం, నాయకులు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం జరుగుతోంది. అయితే ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వచ్ఛాంధ్రమిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇక్కడ మురుగునీటి శుద్ధికేంద్రం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. దీంతో బుధవారం అధికారులు పలమనేరు పెద్దచెరువు ఆయకట్టులో మురుగునీటి శుద్ధికేంద్రం ఏర్పాటుకోసం గుర్తించిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. ఇందుకోసం అధికారులు 3.48 ఎకరాల స్థలాన్ని ఆయకట్టు రైతులనుంచి సేకరించనున్నారు. భూసేకరణ పూర్తి కాగానే శుద్ధికేంద్రం పనులు చేపట్టనున్నారు.

పెద్దచెరువులోనే ఏర్పాటు చేయాలి

పలమనేరు పెద్దచెరువులో మురుగునీరు కలుస్తున్న ప్రదేశంలోనే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. పలమనేరు పెద్ద చెరువులో ఆక్రమణలు గురించి అధికారులు పట్టించుకోక పోవడంతో ఇప్పటికే దాదాపు 15 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. ఈ ఆక్రమణలను తొలగించి చెరువులోనే మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించాలని పలువురు అంటున్నారు. గతంలో కూడా పెద్దచెరువులోనే ఈ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకొన్నప్పటికి ఎందుకో ఆపై పాలకులు పట్టించుకోలేదు.

రీ సర్వేలో తప్పుల సవరణకు గ్రామసభలు



కరకమంద గ్రామసభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ప్రభాకర్

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీ-సర్వేలో తలెత్తిన తప్పులను సరిదిద్దేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో బుధవారం రెవెన్యూ గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులుంటే సంబంధిత రైతులు అర్జీలు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మునికృష్ణమనాయుడు, టీడీపీ నాయకులు గోపీనాయుడు, ఆర్ఐ దొరస్వామి, మండల సర్వేయర్ మర్కొండయ్య, వీఆర్ఓ యర్రయ్య, ప్రజలు పాల్గొన్నారు.

సోమల : 18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ జాబ్ కార్డులు పొందాలని ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని 15 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో నీటి గుంతలు తవ్వుకునేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గ్రామసభల్లో వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచు వెంకటరమణ, ఏపీవో దినకర్‌బాబు, జేఈ రెడ్డెప్ప, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

మితిమీరిన మందుల పిచికారీ వద్దు

● జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి



ప్రసంగిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి

సోమల, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో రెండు కంటే ఎక్కువ పర్యాయాలు మందులు పిచికారీ చేయరాదని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సోమల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మామిడికి ఆశించే ప్రధాన చీడలు, తెగుళ్ల, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలను ఎకరానికి 6-8 అమర్చుకోవాలన్నారు. తెల్లపూత దశలో పూలు విచ్చుకున్నప్పుడు రసాయన మందులను పిచికారీ చేయకూడదని వివరించారు. కాయలు నిమ్మ సైజు ఉన్నప్పుడు కాయలకు కవర్లు తొడగడం వలన నాణ్యమైన దిగుబడి వచ్చి అధిక ధరలు పొందవచ్చునన్నారు. ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం అందించే రాయితీలను తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బాలహుస్సేన్, ఉద్యాన శాఖ అధికారిణి సంతోషికుమారి, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

కుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, గుడుపల్లె మండలాలలో బుధవారం ఎక్సైజ్ సీఐ నాగరాజ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన మొత్తం 144 బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యాన్ని కలిగివున్న రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామానికి చెందిన నారాయణప్ప, గుడుపల్లె మండలం ఓఎన్.కొత్తూరుకు చెందిన శ్రీనివాసులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐతోపాటు ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఎక్సైజ్ సీఐ నాగరాజ మాట్లాడుతూ ఎక్కడైనా సరే కర్ణాటక మద్యం విక్రయిస్తున్నా, రవాణా చేసినా వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. రామసముద్రం మండలం చిట్టింవారిపల్లెకు చెందిన బయన్న భార్య ఈశ్వరమ్మ, అల్లుడు రాజుతో కలసి పుంగనూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో భీమగానిపల్లె క్రాస్ వద్ద వెళుతుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వరమ్మ తీవ్రంగా గాయపడగా పుంగనూరు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఓ యువతి శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చౌడేపల్లె మండలంలో చోటుచేసుకుంది. చౌడేపల్లె మండలం బూరగపల్లెకు చెందిన వెంకట్రమణారెడ్డి కుమార్తె జానకి(29) సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతోందని తల్లిదండ్రులు మందలించడంతో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించి తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

పుంగనూరు రూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారని బాధితుడి తండ్రి తోటి శంకరప్ప ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు మండలం కంగానెల్లూరుకు చెందిన చెన్నకేశవులు, జయశంకర్‌లు తన కుమారుడు భాస్కర్‌కు యోగా ఉపాధ్యాయుడిగా ఉద్యోగం ఇప్పిస్తామని రూ. 2.50లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై చెన్నకేశవులు, జయశంకర్‌ను నిలదీస్తే సదుంకు చెందిన వైసీపీ నాయకుడు, నెల్లూరుకు చెందిన వ్యక్తులకు డబ్బు ఫోన్‌పే చేసినట్లు తెలిపారని వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తవణంపల్లె మండలం కె.పట్నంకు చెందిన సోమశేఖర రెడ్డి బుధవారం రూ.1,00,116 డీడీని విరాళంగా అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

ఐరాల(కాణిపాకం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచౌదరి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆనందగౌడ్, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.11.11 లక్షలు

తవణంపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. 90 రోజులకు గాను రూ.11,11,788 నగదు లభించగా, ఆలయంలో నిరుపయోగంగా ఉన్న 520 కిలోల ఇనుము, 150 కిలోల ప్లాస్టిక్‌ను వేలం వేయడం ద్వారా రూ.14,800 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఆర్వోకు అదనపు బాధ్యతలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ తూర్పు డివిజన్ ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అనంతపురం సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదబాయి ఉత్తర్వులు జారీచేశారు. పశ్చిమ డీఎఫ్‌వో బాలకృష్ణారెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి బాధ్యతలను తూర్పు ఎఫ్ఆర్వోకు అప్పగించారు.

కార్తీక దీపారాధన



రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపారాధన నేత్రపర్వంగా జరుగుతోంది. మంగళవారం రాత్రి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. ఇక్కడి వనంలో ప్రజలు తమ రాశి, నక్షత్రలకు సంబంధించి వృక్షాల వద్ద, నవగ్రహ వృక్షాల వద్ద దీపారాధన చేయడం వల్ల శుభం జరుగుతుందన్నారు. - రామకుప్పం, ఆంధ్రజ్యోతి

ఎఫ్‌సీఐ గోడౌన్ తనిఖీ



పలమనేరు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌ను బుధవారం జేసీ విద్యాధరి తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. నిత్యావసర సరుకుల సరఫరా గురించి ఆరా తీశారు. వేయింగ్ మిషన్‌పై బియ్యం బస్తాలు వేయించి వాటి తూకాన్ని పరిశీలించారు. ఆర్డీవో భవని, తహసీల్దార్ ఇన్బనాథన్ పాల్గొన్నారు. - పలమనేరు, ఆంధ్రజ్యోతి

అధికారుల నిర్లక్ష్యంతో కుంటలుగా మారిన పొలాలు

● రైతులతో కలిసి కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

చిత్తూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలోని పేట అగ్రహారం రైతుల సమస్యలను పరిష్కరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్‌కు బుధవారం పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆయన రైతులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారలోని నీరంతా పంట పొలాలపైకి రావడంతో కుంటలుగా మారాయన్నారు. 80 ఎకరాల్లో పంట నష్టపోయారని చెప్పారు. మామిడి చెట్లు నీళ్లలో ఉండిపోవడంతో కుళ్లిపోతున్నాయన్నారు. స్పందించిన కలెక్టర్ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా, తగినచర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు.

ఎస్సీ బాలికల హాస్టల్, ఎఫ్‌సీఐ గోడౌన్లలో జేసీ తనిఖీలు


ఎఫ్‌సీఐ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళ్యం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, వసతిగృహంలో మౌలిక వసతులు కల్పించాలని సాంఘిక సంక్షేమ డీడీ రాజ్యలక్ష్మిని జేసీ విద్యాధరి ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని జేసీ సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల డైనింగ్ హాలును పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం మార్కెట్ యార్డు వద్ద వున్న ఎఫ్‌సీఐ గోదాముకు జేసీ చేరుకొని అక్కడి రికార్డులను తనిఖీ చేసి, కాటాలను పరిశీలించారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యం, కందిపప్పు, చక్కెర నాణ్యతను పరిశీలించారు. జేసీ వెంట తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, ఆర్‌ఐ మధుసూదన్, గోడౌన్ డీటీ వాసు తదితరులు ఉన్నారు.

మంత్రి పదవిలో ఉన్నపుడు

ప్రజలు గుర్తుకు రాలేదా రోజమ్మా..?

● వడ్డెర విజయభేరి అధ్యక్షుడు రామచంద్రయ్య



చిత్తూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవిలో ఉన్నపుడు ప్రజలు గుర్తుకు రాలేదా రోజమ్మా అని వడ్డెర విజయభేరి రాష్ట్ర అధ్యక్షుడు బండా రామచంద్రయ్య ప్రశ్నించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వడ్డెర్లపై అనేక దాడులు, హత్యలు, అత్యాచారాలు జరిగినపుడు రోజా ఎప్పుడూ నోరు విప్పలేదని విమర్శించారు. మాజీ సీఎం జగన్ మెప్పు పొందేందుకు రోజా కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెనుమూరులో ఓ వడ్డెర విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్యచేస్తే దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తే పోలీసులు అరెస్టుచేసి ఉద్యమాన్ని అణచివేయలేదా అని ప్రశ్నించారు. మంత్రి పదవి పోయిన తర్వాత రోజాకు ప్రజలు గురుకు వచ్చారని ఆయన ఎద్దేవా చేశారు.

అభివృద్ధికి అధికారులు సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో

పాలసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు తనకు సహకరించాలని కొత్తగా వచ్చిన ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ శ్యామల శివప్రకాష్‌రాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మండల స్థాయి అధికారులు పని చేయాలన్నారు. ఏవో ఢిల్లీబాబు మాట్లాడుతూ సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తామన్నారు. మఠవలంలో ఉన్న పురాతన ఆలయం గోవర్ధనాథీశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు దేవదాయ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరామని ఎంపీపీ శ్యామలా శివప్రకాష్‌రాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, పీఆర్ ఏఈ జయరాజ్, డాక్టర్ మోహన్‌కృష్ణ, డాక్టర్ యశస్విని, ఎంఈవో రాజేంద్రప్రసాద్, ట్రాన్స్‌కో వరదరాజులు, హౌసింగ్ ఏఈ దాము, ఏసీవో మార్గరేట్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ సర్పంచ్


చంద్రబాబుకు చెక్కును ఇస్తున్న సుబ్బానాయుడు

గుడిపాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్‌పురం మాజీ సర్పంచ్ సుబ్బానాయుడు, ఆయన కుమారుడు రమేష్‌లు బుధవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును చంద్రబాబుకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు బృందావన్ విద్యార్థి


విన్నర్ కప్ అందుకుంటున్న ప్రణవ్‌సాయి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు స్థానిక బృందావన్ స్కూల్ విద్యార్థి టి.ప్రణవ్‌సాయి ఎంపికైనట్లు కరస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో బృందావన్ సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థి టి.ప్రణవ్‌సాయి ప్రతిభ కనపరచి వెండిపతకం సాధించారు. తమ విద్యార్థి జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

సవరణ

26.06.2024వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన బహిరంగ ప్రకటనలో కె.దొరస్వామి రెడ్డి భార్య కె.దేవకి ప్రాపర్టీని మార్ట్‌గేజ్ చేయుటకు కె.దొరస్వామి రెడ్డి కుమారుడు మహేష్‌కి బులయు ఇచ్చుటకు బదులు కె.దొరస్వామి రెడ్డి గారి కుమారుడు మహేష్ బాబు గారికి చెందిన ప్రాపర్టీ అని ప్రచురితమైనది. సవరించుకోగలరు.
కె.ప్రవీణ్, B.A., B.L., అడ్వకేట్, డి.నెం.10-115, గాంధీ రోడ్, ఎక్స్‌టెన్షన్, చిత్తూరు, సెల్ 9550134756

కలెక్టర్‌ను కలిసిన బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొంది చిత్తూరులో పదవీ బాధ్యతలు స్వీకరించిన 8వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు కేవీఎస్‌బీ మల్లికార్జునరావు, కట్టెడ సింగయ్యలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం


డీడీని అందించి చిత్రపటాన్ని అందుకుంటున్న దాత

ఐరాల(కాణిపాకం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తవణంపల్లె మండలం కె.పట్నంకు చెందిన సోమశేఖర రెడ్డి బుధవారం రూ.1,00,116 డీడీని విరాళంగా అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు


జ్ఞాపికను అందిస్తున్న రవీంద్రబాబు, మణినాయుడు

ఐరాల(కాణిపాకం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణి నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచౌదరి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆనందగౌడ్, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో చిత్తూరు వాసులతో భానుప్రకాష్ సందడి



నగరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో భాగంగా అయోవా స్టేట్‌లోని చిత్తూరు వాసులతో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముచ్చటించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ప్రవాస ఆంధ్ర మహిళల ఇండియా మార్ట్ గ్రోసరీ స్టోర్‌ను భానుప్రకాష్ ప్రారంభించారు. మహిళలంతా ఏకమై స్వయం ఉపాధి కోసం మార్ట్ ప్రారంభించడం ఆనందదాయకమని ఎమ్మెల్యే వారిని అభినందించారు.

రీ సర్వేలో అన్ని తప్పులే...

గుడిపాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీ సర్వేను తప్పులతడకగా చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన కుప్పిగానిపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సర్వేలో తమకు జరిగిన అన్యాయాన్ని అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటి వరకు 404 మంది రైతులు తప్పులతడకగా సర్వే జరిగిందని ఫిర్యాదులు చేశారని రీసర్వే డీటీ రూపాదేవి తెలిపారు. త్వరలో అన్నింటికి పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల సర్వేయర్లు గోపీనాథ్, కిరణ్, సర్పంచ్ మధుసూదన్‌రాయల్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు చెక్కు అందజేత



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్ర జ్యోతి): విజయవాడలో ఇటీవల ఏర్పడిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం తమిళనాడు రాష్ట్రంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కె.సాంబశివన్ రూ.10వేల చెక్కును కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందించారు. స్థానిక దుర్గాకాలనీలో నివాసముంటున్న ఈయన బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి చెక్కును అందించారు. విరాళమందించిన సాంబశివన్ సాయాన్ని కలెక్టర్ కొనియాడారు.

ఇక్కడ రహదారే మురుగుకాలువ..!


పెరుమాళ్లకండ్రిగ రహదారిపై పారుతున్న మురుగునీరు

చిత్తూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ గ్రామానికి వెళ్లే రహదారే మురుగుకాలువగా మారింది. ఏళ్ల తరబడి మురుగుకాలువ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పాటు దోమలు కూడా అధికమయ్యాయి. నిత్యం వందలాది మంది ఈ మార్గంగుండా ప్రయాణిస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగుకాలువ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- చిత్తూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

పొంచివున్న ప్రమాదం

● స్థల ఆక్రమణ కోసం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇనుప సామాన్లు



నగరంలోని సీబీ రోడ్డులోని అంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కంచె చుట్టూ ఓ వెల్డింగ్ షాపు యజమాని తాను తయారు చేసిన గేట్లు, గ్రిల్స్, కిటికీలను ఆనించి పెట్టాడు. మెల్లమెల్లగా ఆ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ఇలా చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌కు గురైతే పక్కనే ఉన్న ఇనుప వస్తువులకు కరెంటు సరఫరా అయితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఆక్రమణలతో పాటు ఇనుప సామాన్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- చిత్తూరు అర్బన్, (ఆంధ్రజ్యోతి)

ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే కేసులు

● ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్


మాట్లాడుతున్న విజయశేఖర్

నగరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే కేసులు తప్పవని మద్యం షాపుల లైసెన్సు దారులను చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తలమల విజయశేఖర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి విచ్చేసిన ఆయన సిబ్బందికి అక్రమ మద్యం విక్రయాల నిషేధంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సరిహద్దు ప్రాంతాల్లో సారా, మద్యం రవాణా కాకుండా పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో సరిహద్దు ప్రాంతంలో తమిళనాడుకు చెందిన అధికారులతో కలసి ఉమ్మడి దాడులు కూడా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

వెదురుకుప్పం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు షాపులను నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వారికి మద్యం విక్రయించిన దుకాణం లైసెన్స్ రద్దుపరుస్తామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అన్నారు. కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. సీఐ శిరీష, ఎస్‌ఐలు మోసస్, శ్రావణ్‌తేజ్, హెడ్ కానిస్టేబుల్ పళని, పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వకుంటే 14న నిరసన దీక్ష

నగరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వకుంటే ఈ నెల 14వ తేదీ జడ్పీ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడతామని ఏపీ గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.శ్రీరాములు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు గత 12 నెలల జీతాలు చెల్లించాలని, నిలిపివేసిన కార్మికులను పనిలోకి చేర్చుకోవాలని కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈనెల 14నుంచి జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాజేంద్ర, సభ్యులు ఏసుపాదం, దేశప్ప, జ్ఞానమణి, మారన్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఐరాల విద్యార్థులు



ఐరాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరు డీఎస్‌ఏ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలలో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. బాలుర విభాగంలో లోకేష్, గణేష్, తులసి, గిరీష్, దినేష్‌రెడ్డి, బాలికల విభాగంలో పావని, మెగిలీశ్వరి, మైథిలి, ఆసియా ఎంపికయ్యారన్నారు. వీరందరూ త్వరలో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను ఫెన్సింగ్ పోటీలలో తీర్చిదిద్దిన పీడీ దేవా, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తీక్‌లను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీ కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే


పాడె మోస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త మునిరత్నం మృతదేహానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ నివాళులర్పించారు. బుధవారం మధ్యాహ్నం పెరుమాళ్లపెంట గ్రామానికి చేరుకుని మునిరత్నం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతదేహంపై టీడీపీ జెండా కప్పి అంతిమయాత్రలో పాల్గొని పాడెమోశారు. మునిరత్నం కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌రబీ, హేమగిరి, వల్లేరు అమర్‌నాథ నాయుడు, చిత్రా నాయుడు, గుణశేఖర్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీటీడీ పాలకమండలి సభ్యుడికి సన్మానం


రాజశేఖర్ గౌడ్‌ను సత్కరిస్తున్న ఈడిగ సంఘం సభ్యులు

బంగారుపాళ్యం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడుగా మల్లెల రాజశేఖర్ గౌడ్ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బుధవారం తిరుమలలోని కావేరిభవన్‌లో చిత్తూరు టీడీపీ పార్లమెంటు బీసీ సాధికార సమితి అధ్యక్షుడు బుస్సా నాగరాజ్ గౌడ్, ఈడిగ కులస్థులు ఆయన్ను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు మంత్రి పదవులు, టీటీడీ పాలకమండలిలో స్థానం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తోయజాక్షులు గౌడ్, శివకుమార్ గౌడ్, రెడ్డెప్ప గౌడ్, మురళీ గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

హుండీ చోరీ


దొంగలు పగుల కొట్టిన హుండీ

యాదమరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలపాచిగుంట గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయ తాళం పగులకొట్టి హుండీలో నగదు, అమ్మవారి తాళిబొట్టు దొంగలు దోచుకెళ్లారు. స్థానికుల కథనం మేరకు... పాచిగుంటలో అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఉన్న ముత్యాలమ్మ గుడి తాళాన్ని మంగళవారం అర్ధరాత్రి దొంగలు విరగ్గొట్టి గర్భగుడిలో ప్రవేశించి అమ్మవారి మూడు గ్రాముల బంగారు తాళిబొట్టు, హుండీలో భక్తులు సమర్పించిన దాదాపు రూ.30వేల నగదు దోచుకెళ్లారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలే కీనాటంపల్లె ఎల్లమ్మతల్లి ఆలయంలో దొంగలు పడ్డారు. గతంలో కాశిరాళ్ల, భూమిరెడ్డిపల్లి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి ఆలయ నిర్వాహకులతో సీసీ కెమెరాలతో పర్యవేక్షణలో నేరాలు నియంత్రణ దిశగా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

నైపుణ్య గణనపై శిక్షణ

వెదురుకుప్పం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించాలని పరిపాలనాధికారి విద్యావతి తెలిపారు. బుధవారం కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు 'నైపుణ్యం కలిగిన వారిని గుర్తించుటకు శిక్షణ' సమావేశం జరిగింది. ఆమె సచివాలయ ఉద్యోగులకు సూచనలు, సలహాలను ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళియంబాకం ప్రాథమిక పాఠశాలలో బుధవారం రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదు వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, నోటుపుస్తకాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూరలక్ష్మి, విద్యాకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.11.11 లక్షలు

తవణంపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. 90 రోజులకు గాను రూ.11,11,788 నగదు లభించగా, ఆలయంలో నిరుపయోగంగా ఉన్న 520 కిలోల ఇనుము, 150 కిలోల ప్లాస్టిక్‌ను వేలం వేయడం ద్వారా రూ.14,800 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు క్యాంటీన్‌లో పనిచేయడానికి సిబ్బంది కావాలి

చిత్తూరు అర్బన్, నవంబరు 6: కేంద్రీయ పోలీసు కళ్యాణ్ బండార్ (సెంట్రల్ పోలీసు క్యాంటీన్)లో పనిచేయడానికి ఆసక్తికలిగిన యువతీ యువకులు కావాలని ఆర్‌ఐ భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంటీన్‌లో సేల్స్‌బాయ్, సేల్స్‌గర్ల్స్ పనిచేయడానికి ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆసక్తికలిగినవారు ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్ పక్కన ఉన్న జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎంటీవో కార్యాలయంలో గురువారం నుంచి 12వ తేదిలోపు దరఖాస్తులను ఇవ్వాలని కోరారు. ఇతర వివరాలకు 94910 74516 నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రత్యక్ష అనుభవం కోసమే ఇంటర్న్‌షిప్

నగరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానంలో అంతర్భాగమైన ఇంటర్న్‌షిప్ ద్వారా కళాశాలలో నాలుగు గోడల మధ్య విద్యనభ్యసించే విద్యార్థికి, పరిశ్రమలతో ప్రత్యక్ష అనుభవం ఏర్పడుతుందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం కళాశాలలో కెరీర్ గైడెన్స్ విభాగం, ఐక్యూ విభాగం, సత్యా ఇన్ఫోటెక్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగం అధిపతి రేవతి, సత్యా ఇన్ఫోటెక్ ప్రతినిధి హేమంత్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, ఐక్యూ కో-ఆర్డినేటర్ ఇందిరాప్రియదర్శిని, జేకేసీ కో-ఆర్డినేటర్ పంకజ, శ్రీలక్ష్మి, మునికుమారి, హరికృష్ణ, లాల్ బాషా, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గ్రామసభ ద్వారానే సమస్యల పరిష్కారం

శ్రీరంగరాజపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామసభల ద్వారా ప్రజలు సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం 49.కొత్తపల్లె గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ డి.వి.డిల్లెయ్య, టీఏ రామ్మూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ మునిరత్నం, టీడీపీ నాయకులు సూరిరెడ్డి, గురునాధం, యోగి నాయుడు, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్వోకు అదనపు బాధ్యతలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ తూర్పు డివిజన్ ఎఫ్‌ఆర్వో థామస్ సుకుమార్‌కు పశ్చిమ డివిజన్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అనంతపురం సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదబాయి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

పశుగణన పక్కాగా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న 21వ జాతీయ పశుగణన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పక్కాగా చేపట్టాలని పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. శాఖలోని పలు అంశాలు, వాటి పురోగతిపై బుధవారం జిల్లా కార్యాలయంలో పశువైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాడి రైతులకు మంజూరైన గోకులాలను ఉపాధి నిధులతో నిర్మాణాలు చేపట్టే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 16 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిన క్రమంలో కరువు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల విభాగం ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ హరీఫ్, ఏడీ, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో చేసిన సర్వే ప్రకారమే ప్రహరీ నిర్మిస్తున్నాం

విజయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన సర్వే ప్రకారమే మండలంలోని పాతార్కాడు ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్‌ఎంసీ ఛైర్మన్ వేలాయుధం పేర్కొన్నారు. పాఠశాల ఆస్తికి రక్షణ కల్పించాలని కూటమి ప్రభుత్వం ప్రహరీ మంజూరుచేస్తే వైసీపీ నాయకులు బురద చల్లుతున్నారని, అభివృద్ధిని స్వాగతించాలని కోరారు.

ఉపాధి కూలీలకు పనిదినాల పెంపు

పెనుమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలాన్ని కరువు మండలంగా గుర్తించినందున ఉపాధి హామీలో కూలీలకు పనిదినాలను పెంచేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని ఏపీవో గుణశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నీ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీలు శ్రీనివాసులు, నిర్మలాదేవి, మనోరంజని, సురేఖ, లాంచన, సురేంద్ర, ఉపాధి సిబ్బంది సతీష్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.